క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడికి పురస్కారం



డీఈఓ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న దేవిసింగ్ రాథోడ్

జహీరాబాద్ టౌన్: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన దేవిసింగ్ రాథోడ్‌ను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్ సన్మానించి పురస్కారం అందజేశారు. నియోజకవర్గంలోని పడియాల్ తండాకు చెందిన దేవిసింగ్ మొగుడంపల్లి మండలంలోని రాయిపల్లి తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. తండాలో పాఠశాలను అభివృద్ధి చేసి విద్యా ప్రమాణాలను పెంపొందించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవిసింగ్ రాథోడ్‌ను సన్మానించి ప్రశంసపత్రాన్ని అందజేశారు. తనకు పురస్కారం రావడం ఆనందంగా ఉందని దేవిసింగ్ రాథోడ్ అన్నారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

సంగారెడ్డి మున్సిపాలిటీ: సీఎం కేసీఆర్ పర్యటనకు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ రమణ కుమార్ తెలిపారు. బుధవారం పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా, పటాన్ చెరులో నిర్మించ తలపెట్టిన ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి శంకుస్థాపనకు విచ్చేయుచున్న సందర్భంగా 1600 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

రాయికోడ్(అందోల్): హామీల అమల్లో ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ బ్లాక్, మండల అధ్యక్షులు అంజయ్య, నర్సింహులు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. రాయికోడ్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తున్నాయన్నారు. పేద ప్రజలపై ప్రేమ ఉంటే ప్రతి పేదవాడికి రూ.లక్ష సాయం చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయమని తెలిపారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు కిషన్, సర్పంచ్‌లు కేధారినాథ్ పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, రామ్‌పాటిల్, సొసైటీ చైర్మన్ నాగిశెట్టి, ఎంపిటిసి కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

జిన్నారం(పటాన్‌చెరు): నేడు పటాన్‌చెరులో నిర్వహించనున్న సీఎం సభను విజయవంతం చేయాలని జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని శివానగర్ గ్రామంలో బుధవారం పార్టీ కార్యకర్తలతో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సోలార్ ల్యాంపుల పంపిణీ

కోహీర్ (జహీరాబాద్): మండల పరిధిలోని బడంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్థానిక సీరోక్లిన్ ఫార్మ కర్మాగార యాజమాన్యం విద్యార్థులకు సోలార్ ల్యాంపులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కర్మాగారం హెచ్ఆర్ మేనేజర్ స్రవంతి మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సోలార్ ల్యాంపులు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శంకర్, ఉపసర్పంచ్ రాజన్న, గ్రామపెద్దలు సుధాకర్ పాల్గొన్నారు.

రాజగోపాల్‌రెడ్డికి ఉత్తమ అవార్డు



జ్ఞాపిక అందజేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీ

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ట్రిపుల్‌ఈ హెడ్‌ఓడీ లోఅధ్యాపకుడు పి.రాజగోపాల్‌రెడ్డి జిల్లాస్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన విద్యాదినోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, అదనపు కలెక్టర్ వీరారెడ్డి తన చేతుల మీదుగా ప్రసంసాపత్రం, జ్ఞాపిక అందజేశారని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

- ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలుచోట్ల దేవతామూర్తులను విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగించి భక్తులకు అన్నదానం చేశారు.



వట్‌పల్లి: అర్చకులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్



నారాయణఖేడ్: కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



జహీరాబాద్ టౌన్: బాగారెడ్డిపల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



జిన్నారం: బొంతపల్లిలో పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు



రాయికోడ్: అతిథులను సన్మానిస్తున్న నాయకులు



హత్నూరలో..



మనూరులో..

తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు: ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జయశంకర్ వర్ధంతి సందర్భంగా జయశంకర్ కాంస్య విగ్రహానికి నివాళ్లు అర్పించారు. కార్పొరేటర్ కుమార్ యాదవ్, జెడ్పీటీసీ సుప్రజ, ఎంపీపీ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ కృషి మరువలేనిది

జహీరాబాద్ టౌన్: తెలంగాణ స్వయం పాలనా స్వాప్నికుడు, స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ కృషి మరువలేనిదని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో జయశంకర్ వర్ధంతిని నిర్వహించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ప్రత్యేక అధికారి జయదేవ్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని నారాయణఖేడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. స్వర్ణకార సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఖేడ్ డివిజన్ ఉపాధ్యక్షుడు రవీంద్రచారి, సభ్యులు పాండుచారి, శ్రీకాంత్‌చారి, లక్ష్మణచారి, రాజుచారి, జైపాల్‌చారి, కాశీనాథ్‌చారి పాల్గొన్నారు.



జహీరాబాద్ టౌన్: జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



నారాయణఖేడ్‌లో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జయశంకర్ వర్ధంతిని నిర్వహించారు. మల్లికార్జుననగర్ కాలనీలో నిర్వహించిన జయశంకర్ వర్ధంతిలో కార్పొరేటర్ పుష్ప పాల్గొన్నారు ఎల్ఐజీ వార్డు కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి కార్పొరేటర్ సింధు నివాళులర్పించారు.

జిన్నారం(పటాన్‌చెరు): తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని జిన్నారంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, ఉపసర్పంచ్ సంజీవల ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యోగా నిపుణులు, ప్రజాప్రతినిధులు, అధికారులు యోగా ప్రాధాన్యతను వివరించారు. పలుచోట్ల విద్యార్థులు ఆరోగ్య జీవనానికి అవసరమగు యోగా విన్యాసాలను ప్రదర్శించారు.



నారాయణఖేడ్: స్థానికులతో కలిసి ఆసనాలు వేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



జహీరాబాద్ టౌన్: యోగా దినోత్సవంలో పతంజలి యోగ సమితి సభ్యులు



హత్నూరలో..



రామచంద్రాపురంలో..



ఝరాసంగంలో..

అన్ని వర్గాల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



స్థానికులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల

కంది (సంగారెడ్డి): ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్రపశు సంవర్ధక, మత్స్యశాఖమంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. మహజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా బుధవారం సంగారెడ్డి జిల్లా కందిలో బీజేపీ 9 ఏళ్ల పాలనపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమమే దేశ సంక్షేమంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గతంలో పాలించిన ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు రాజేశ్వర్ రావు దేశ్పాండే, చంద్రశేఖర్ గుప్తా, పోచారం రాములు, జగన్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఆత్మకూర్ గ్రామంలో బుధవారం ఇళ్లు లేని నిరుపేదలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు గ్రామంలో అనేకమంది పేదలు ఇళ్ల స్థలాలు లేక ఇరుకు గదుల్లో నివాసం ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 170 సర్వే నెంబర్‌లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పొజిషన్ చూపడంలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మహేష్ పాల్గొన్నారు.

'బహుజన సమాజంపై చిత్తశుద్ధి లేదు'



మాట్లాడుతున్న ప్రకాశం

వట్‌పల్లి(అందోల్): బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బహుజన సమాజంపై చిత్తశుద్ధి లేదని బీఎస్పీ అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పారం ప్రకాశం అన్నారు. బుధవారం జోగిపేటలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకోవడానికే పరిమితమై నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అందోల్ అసెంబ్లీ నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఇన్‌చార్జిగా చాందుపాషా, నియోజవర్గ అధ్యక్షులుగా పల్లె కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా కాంతారావు, ప్రధాన కార్యదర్శిగా పాపయ్య, కోశాధికారిగా రవి, మహిళా కన్వీనర్‌గా మమత, కోకన్వీనర్‌గా సుప్రియ, ఈసీ సభ్యులుగా ముప్పారం పద్మారావు, శేఖర్, పల్లె రవికుమార్‌ను ఎన్నుకున్నారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండలంలోని మోర్గి గ్రామ వంతెన నిర్మాణానికి సంబంధించిన సెంట్రింగ్ డబ్బాల చోరీ ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దశరథ్ తెలిపారు. వివరాలలోకి వెళ్తే.. కర్నాటక ప్రాంతానికి చెందిన ఆటోలో సెంట్రింగ్ డబ్బాను నింపుకుని వెళ్లుతుండగా అక్కడే పని చేస్తున్న వాచ్‌మెన్ ఆగమయ్య గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు విచారణ చేపట్టగా కర్నాటకలోని బీదర్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్, మహ్మద్ ఇక్బాల్‌గా గుర్తించి సెంట్రింగ్‌తో పాటు ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు ప్రశంస పత్రాలు



ప్రశంసపత్రాలు అందుకున్న ఖేడ్ విద్యార్థులు

నారాయణఖేడ్: ప్రతిభచూపిన నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం రాత్రి సంగారెడ్డిలో నిర్వహించాన విద్యాదినోత్సవంలో సన్మానించి జ్ఞాపికలు, ప్రశంసపత్రాలను అందజేశారు. జిల్లాస్థాయిలో 12 మంది ఉత్తమ విద్యార్థులను సన్మానానికి ఎంపిక చేశారు. అందులో నలుగురు ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో జిల్లాస్థాయిలో విగ్నేష్‌గౌడ్ ప్రథమ, నిఖిత ద్వితీయ ర్యాంకులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో సింధూజ ప్రథమ, నందిని ద్వితీయ ర్యాంకులు పొందారు. నీట్-2022లో మేహంత్ 476 ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ విద్యనభ్యసిస్తున్నాడు. వారికి అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

హెచ్‌ఎంకు సన్మానం



న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మల్గి ఉర్దూ మీడియం హెచ్‌ఎం సాదియాను సర్పంచ్ మారుతియాదవ్, నాయకులు శ్రీపతి తదితరులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా దినోత్సవం సందర్భంగా హెచ్‌ఎం సాదియా జిల్లా స్థాయిలో అవార్డు అందుకోవడం హర్షనీయమని తెలిపారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

రామచంద్రాపుర(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలితా సోమిరెడ్డి అధ్యక్షతన బుధవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.4.5కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేయగా సమావేశంలో వాటిని ఆమోదించారు. కౌన్సిలర్ భరత్ మాట్లాడుతూ కొల్లూర్‌లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో స్థానికులకు 25శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు సమావేశంలో తీర్మానం చేయాలని కోరగా మున్సిపల్ చైర్‌పర్సన్ నిరాకరించారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్‌కు వినతి పత్రం ఇస్తామ ఆమె తెలిపారు. తీర్మానం చేయకపోవడంతో కౌన్సిలర్‌లు భరత్, మంజుల, సరిత, పావని, మయూరి, శంషాబాద్ రాజు సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ మహిళలకు సర్టిఫికెట్ల అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గుమ్మడిదల గ్రామంలో కేంద్ర ప్రభుత్వ కాయర్ బోర్డ్ సంస్థ, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మహిళలకు కొబ్బరి పీచుతో వస్తువులను తయారు చేయటంపై 20 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలకు బుధవారం సర్పంచ్ నర్సింహారెడ్డి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. మైత్రి ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్‌కుమార్, ఏపీఎం శివకుమార్, సీసీ వరలక్ష్మి, ట్రైనర్ మీనా పాల్గొన్నారు.

◆ రోడ్డు ప్రమాదాలు నియంత్రించాలి

కల్హేర్(నారాయణఖేడ్): రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని నారాయణఖేడ్ సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మాసాన్‌పల్లి చౌరస్తాలో వెంకటాద్రి ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 161 హైవే పక్కన ఉన్న హోటళ్ల, కిరాణషాపు యజమానులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తులను వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు సహకరించాలని కోరారు.

◆ బీఆర్ఎస్‌లో చేరికలు



నారాయణఖేడ్: కంగ్టి మండలంలోని తుర్కవడ్‌గామకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం నారాయణఖేడ్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: మండలంలోని రంజోల్‌కు చెందిన ప్రతాప్‌రెడ్డి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు.యూత్ కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

◆ వినతిపత్రం అందజేత

న్యాల్‌కల్(జహీరాబాద్): గోవధ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ బుధవారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు హద్నూర్ పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవధ నిషేధ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్, సుమన్, దర్గాప్రసాద్, అరవింద్, నితిన్ గౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.

◆ గో నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

వట్‌పల్లి(అందోల్): గో నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గోరక్షప్రముఖ్ ప్రభుగౌడ్,జిల్లా ధర్మ ప్రసార సంయోజక్ దివాకర్ సుమన్, ధర్మరక్షక్ అరవింద్, నితిన్‌గౌడ్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చింతా ప్రభాకర్ కృషితో వార్డు అభివృద్ధి



సంగారెడ్డి మున్సిపాలిటీ: టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ కృషితో గతంలో ఎన్నడూ లేని విధంగా సంగారెడ్డి పట్టణం అభివృద్ధి చెందిందని వార్డు కౌన్సిలర్ పద్మ అన్నారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని 37వ వార్డులో వీరభద్రనగర్‌లో రూ.37 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ప్రారంభించారు.

◆ బస్‌పాస్‌లు అందజేత

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండలం కేంద్రంలో 10మంది దివ్యాంగులకు బుధవారం బస్‌పాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మార్కెటింగ్ అధికారి పాండు, ఏపీఎం అనంతయ్య మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ కలిగి ఉన్న వారు, ఇప్పటికీ బస్‌పాస్ పొందనివారు ఖేడ్‌లోని ఆర్టీసీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ నీలం మధు అనుచరులపై దాడి హేయం



వట్‌పల్లి(అందోల్): నీలం మధు అనుచరులపై దాడి హేయమైన చర్య అని జిల్లా బీసీ నాయకుడు, కౌన్సిలర్ నాగరాజు అన్నారు. ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో నీలం మధు అనుచరులపై దాడులను ఖండిస్తూ బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర నేత నీలం మధు ఎదుగుదలను కొందరు ఓర్వలేకపోతున్నారన్నారు. సీఎం కేసీఆర్ పటాన్‌చెరువు నియోజకవర్గంలో మంగళవారం పర్యటించనున్న సందర్భంగా ముఖ్యమంత్రికి స్వాగతం చెప్పడానికి నీలం మధు అనుచరులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తుండగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయకుండా అడ్డుకోవడమే కాకుండా భౌతిక దాడులకు దిగడం విచారకరమని తెలిపారు.